క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆపార్టీ గజ్వేల్ అభ్యర్థి తూకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ అమలు చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లుగా రుణమాఫీ అమలు చేస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాచారి, నాయకులు వీరేశం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

కొండపాక(గజ్వేల్): బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యమవుతుందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని బందారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసే పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. అలాగే కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, కోలోనివంపు, కాకులగడ్డలోని బీజేపీ కార్యకర్తలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ర్యాగల్ల దుర్గయ్య, నీల వెంకటేష్, నరేష్, కిరణ్ కుమార్‌చారి, బట్ట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి

రాయపోలు(దుబ్బాక): ఆకతాయిల పట్ల అమ్మాయిల అప్రమత్తంగా ఉండాలని రాయపోలు ఎస్సై రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయంలో బుధవారం షీ టీం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొందరు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బాల్య వివాహాలు.. మరికొందరు తల్లిదండ్రులను ఎదురించి వివాహం చేసుకుని తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారన్నారు. ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులు, లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రాయపోలు పోలీస్ సిబ్బంది, షీటీం బృందం, పాల్గొన్నారు.

'కేసీఆర్ గెలుపునకు కృషి చేయాలి'

ములుగు(గజ్వేల్): సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మక్కపల్లి, చిన్నతిమ్మాపూర్‌లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ వైస్ చైర్మన్లు నరేష్ గౌడ్, భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గణేష్‌గుప్త, లింగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష, సర్పంచ్‌లు మహేష్‌యాదవ్, బాల్‌నర్సింలు నాయకులు నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మల్లేష‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌యాదవ్, లింగంయాదవ్, వెంకటేష్‌యాదవ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం ఖాయం

డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి



ములుగు(గజ్వేల్): సీఎం కేసీఆర్‌పై ప్రజలకు పూర్తి నమ్మకం ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌కే పట్టం కడుతారని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ములుగులో ఆయన మా ట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటా ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. సీఎంగా కేసీఆర్ మూడో సారి హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కనుకయ్య, కరుణాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ నాయకులు కామిడి జీవన్‌రెడ్డి, మేక మల్లేశం, మహమ్మద్ షౌకత్ సమక్షంలో మద్దూరు మాజీ సర్పంచ్ ముక్తర్ తాజ్ మహమ్మద్, ఉపసర్పంచ్ ఆరీఫ్, తదితరులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం



ప్రతిభ చూపిన విద్యార్థులతో సినీ నటుడు సుమన్ తదితరులు

గజ్వేల్‌రూరల్: స్వీయరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని జేకేఏఐ(జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా చీఫ్ కరాటే మాస్టర్ రాచకొండ ఆంజనేయులు పేర్కొన్నారు. మేడ్చల్‌లోని ప్రకృతి అవెన్స్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో జేకేఏఐ సంస్థ చైర్మన్, సినీ నటుడు డాక్టర్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా ప్రతిభ చాటిన గజ్వేల్‌కు చెందిన విద్యార్థులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఈసందర్భంగా బుధవారం గజ్వేల్‌లో కరాటే మాస్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు కరాటేతో పాటు డబుల్ నాన్‌చాక్, కర్రసాము, జిమ్నాస్టిక్స్, యోగాసనాలు తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

'ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోండి'

గజ్వేల్‌రూరల్: పొలాల్లోకి వెళ్లకుండా ప్రహరీ నిర్మించి అడ్డుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారం- ప్రజ్ఞాపూర్ పొలిమేరలో ఉన్న భూముల్లో 50 ఏళ్లుగా తాము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి శేఖర్‌గుప్త 4 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేశాడని తెలిపారు. ఆ సమయంలో పొలాల్లోకి వెళ్లేందుకు ఆరు ఫీట్ల రోడ్డు సౌకర్యం కల్పిస్తానని ఒప్పందపత్రం రాసుకున్నామన్నారు. ఇప్పుడు ప్రహరీ నిర్మించి బెదిరింపులకు గురిచేస్తున్నాడని వాపోయారు.

'ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలి'

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల శివారులో ఇథనాల్ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని బుధవారం పంచాయతీ ఎదుట గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామ సభ లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ కొందరు వార్డు సభ్యులు మాత్రమే తీర్మనం చేసి అనుమతులిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేయడంతో కలెక్టరేట్ నుంచి ఎన్‌ఓసీ రద్దు చేయిస్తామని పాలకవర్గం రాత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పరిశ్రమతో ఇబ్బందులు ఎదురవుతాయని తిమ్మయపల్లె రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కొండపాక(గజ్వేల్)/తొగుట/మిరుదొడ్డి: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ కోరారు. మండల పరిధిలోని దర్గా, రాంపల్లి, జప్తినాచారం, రవీంద్రనగర్, ఖమ్మంపల్లి గ్రామాల్లో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తొగుట మండలంలోని బండారుపల్లి, ఎల్లారెడ్డి, జప్తిలింగారెడ్డిపల్లి, తొగుటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ శ్రీధర్ ప్రారంభించారు. మిరుదొడ్డి మండల పరిధిలోని అందె, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఐకేపీ సీసీలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



ఖమ్మంపల్లిలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్/చేర్యాల: సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని వాసవి కాటన్ ఇండస్ట్రీస్, సాయి బాలాజీ, ఈశ్వరసాయి, అలిరాజపేటలోని విశ్వతేజ, జగదేవ్‌పూర్‌లోని శ్రీనివాస, చేబర్తిలోని సర్వేజన కాటన్ ఇండస్ట్రీస్‌లో సీసీఐ ద్వారా గురువారం నుంచి పత్తి కొనుగోళ్లు జరుగుతాయన్నారు. అలాగే చేర్యాలలోని మల్లికార్జున కాటన్ ఇండస్ట్రీలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి పరమేశ్వర్, సీసీఐ అధికారి అమిత్, డీఎంఓ నాగరాజు, మిల్లు యాజమాన్యం పాల్గొన్నారు. హుస్నాబాద్‌లోని ఆర్‌కే, గోమాత కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించినట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సుజన్ కుమార్ తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వర్గల్(గజ్వేల్): వర్గల్ సమీపంలో ఎదురెదురుగా బైకులు ఢీకొన్న ఘటనలో తీవ్రగాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లావెంకటాపూర్‌కు చెందిన అన్నదమ్ములు దారమైన నాగేష్, నాగార్జున డూపాంట్ కంపెనీలో పనిచేస్తున్నారు. సోమవారం డ్యూటీ ముగించుకుని బైక్‌మీద వెళుతుండగా వర్గల్ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎండీ షరీఫ్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



చేర్యాల ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేర్యాల మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం

చేర్యాల(సిద్దిపేట): అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు, బతుకమ్మలు, కోలాటాలతో ఘన స్వాగతం పలకగా.. పల్లా గడిచిన పదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. చేర్యాలకు తెలంగాణ సాయుధ పోరాటం నుంచి రాష్ట్రసాధన ఉద్యమం వరకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పట్టణ అభివృద్ధి సీఎం కేసీఆర్.. సుందరీకరణ బాధ్యత తనదేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 10 కోట్ల నిధులు ఇచ్చిందని.. సరిపోకుంటే మరిన్ని నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికలు అయిపోగానే నెల రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరు చేయిస్తానన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా మరో 7 వేల ఇళ్లు తెచ్చి అర్హులందరికీ అందజేస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే సీడీపీ నుంచి రూ. 50 లక్షలతో రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం జరుగుతుందన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం ఇటీవల జనగామ సభలో సీఎం ప్రకటించిన విషయం గుర్తు చేశారు. చేర్యాలకు ఈనెల 18వ తేదీన సీఎం కేసీఆర్ వస్తున్నారని, పట్టణ అభివృద్ధికి సరిపడా నిధులు అడిగి తీసుకుందామన్నారు.

అభివృద్ధిలో పోటీ పడాలి

లోకల్, నాన్‌లోకల్ అని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలని సవాల్ విసిరారు. పట్టణకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. తాను జనగామ జిల్లా బిడ్డనే అని.. లోకల్, నాన్ లోకల్ అని ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

మద్దూరు మండల పరిధిలోని వంగపల్లి శివారు ఉప్పరోనిగడ్డకి చెందిన 30 మంది కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, రాష్ట్ర నాయకుడు జల్లి సిద్దయ్య, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, రైతు బంధు మండల కో-ఆర్డినేటర్ రంజిత, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, మాజీ సర్పంచ్ ముస్త్యాల ఆరుణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ఓటు వేయండి

జనగామ: తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓటు వేయాలని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ అన్నారు. పట్టణంలోని 30,19, 26, 2 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కౌన్సిలర్లు బండ పద్మ, బొట్ల శ్రీనివాస్, వాంకు డోతు అనిత, కర్రె శ్రీనివాస్, గజ్జెల నర్సిరెడ్డి, దేవరాయ నాగరాజు, తిప్పారపు విజయ్, రాజు, బిజ్జాల నవీన్‌గుప్తా, ఉడుగుల నర్సింహులు, చెంచారపు పల్లవి, తదితరులతో కలిసి ఆమె బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. అంతకు ముందు 2వ వార్డులో చైర్‌పర్సన్ జమున పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కాగా నీలిమ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



జనగామలో బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పల్లా సతీమణి నీలిమ

గోదావరి జలాలు కేసీఆర్ చలువే

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గానికి గోదావరి జలాలు రావడం సీఎం కేసీఆర్ చలువేనని మండలంలోని పోచన్నపేట ఎంపీటీసీ మామిడి అరుణబలయ్య అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరపున గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే పల్లా గెలుపొందాలని జనగామ మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరిగౌడ్, ఎర్రగొల్లపహడ్ గ్రామస్తులు కొడవతూర్‌లోని సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి ముడుపు కట్టారు.

విద్యుదాఘాతంతో డీసీఎం డ్రైవర్ మృతి

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దిలాల్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం తిమ్మకపల్లికి చెందిన జూకంటి గురువారెడ్డి(40)కి భార్య సుమ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గురువారెడ్డి రైతులు పండించే వివిధ రకాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో దిలాల్‌పూర్‌లోని ఓ రైతు సాగుచేసిన కర్బూజను కొనుగోలు చేసి తరలించేందుకు బుధవారం వచ్చాడు. అక్కడ కర్బూజను డీసీఎంలో నింపుతుండగా... పైనున్న విద్యుత్ తీగలను గమనించకుండా డీసీఎంపైకి ఎక్కి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీ హబ్‌లో ముందస్తు దీపావళి



దీపావళి వేడుకలు జరుపుకొంటున్న ఇన్‌టోన్ కంపెనీ ప్రతినిధులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట శివారులోని ఐటీ హబ్‌లో ఇన్‌టోన్ నెట్ వర్కింగ్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. కంపెనీ పరిసరాలను పూలతో అలంకరించారు. స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌టోన్ సీఈఓ ఆరోగ్యరెడ్డి, కంపెనీ ప్రతినిధులు థామస్‌రెడ్డి, టీం సభ్యులు సాయికృష్ణ, కిరణ్, అచ్యుత్, అనూష పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **19న దౌల్తాబాద్‌లో యువగర్జన**

దౌల్తాబాద్(దుబ్బాక): ఈనెల 19వ తేదీన మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువగర్జన సభకు మంత్రి కేటీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చేపూరి శేఖర్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో మండల బీఆర్ఎస్ యూత్ నాయకుడు కలీలొద్దీన్ ఆధ్వర్యంలో ఆయా మండలాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాపాని సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **'విశ్వరూప సభకు తరలిరండి'**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదగిల విశ్వరూప మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని అనంతసాగర్, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు.

◆ **సంక్షేమానికే పట్టం కట్టండి**

మద్దూరు(హుస్నాబాద్): అభివృద్ధి, సంక్షేమానికే ప్రజలు పట్టం కట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ కోరారు. బుధవారం మద్దూరు మండల పరిధిలోని గాగిళ్లాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

◆ **బీఆర్ఎస్‌లో చేరికలు**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వంగ వెంకట్రామిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నతస్థానంలో నిలిచినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పల్లెపహాడ్ గ్రామ యువజన నాయకుడు కొమ్ము నరేష్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్)లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 6 వేల విలువైన కుర్చీలను అందజేశారు.

◆ **పర్యావరణ కాలుష్యంపై అవగాహన**

హుస్నాబాద్: స్వచ్ఛ దీపావళి.. శుభ దీపావళి కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ కాలుష్యంపై అధికారులు అవగాహన కల్పించారు. పట్టణంలోని కమర్షియల్ ఏరియాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం, పర్యావరణ కాలుష్యంపై వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, జూనియర్ అసిస్టెంట్ శంకర్, పర్యావరణ ఇంజినీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య తండ్రి సోమయ్య ఇటీవల మృతిచెందగా బుధవారం రాత్రి మంత్రి హరీశ్‌రావు దుర్గయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాగృతి రాష్ట్ర కన్వీనర్ అనంతుల ప్రశాంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

◆ **పోరాడిన వ్యక్తిని ఆదరించండి**

మద్దూరు(హుస్నాబాద్): నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న సీపీఎం అభ్యర్థి మోకు కనకారెడ్డికి అధిక మెజార్టీ అందించి అసెంబ్లీకి పంపిద్దామని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. బుధవారం దూళ్మిట్ట మండల కేంద్రంలో పార్టీ మండల సమావేశం నిర్వహించారు.

◆ **అభివృద్ధికి ఓటు వేయండి**

చేర్యాల(సిద్దిపేట): డబ్బు, మద్యానికి తాకట్టు పెట్టకుండా అభివృద్ధికి కృషిచేసే నాయకుడికి ఓటు వేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు అందె బీరన్న పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాకాల ఇసాక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

◆ **'పల్లా'కు మద్దతుగా ప్రచారం**

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంతో పాటు అయినాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపల్లి కిష్టయ్య, సార్ల కిష్టయ్య, ముత్యం నర్సింహులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కిడ్నీ బాధితుడికి భరోసా**

ములుగు(గజ్వేల్): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ములుగుకు చెందిన దూసరి భాస్కర్‌కు మెరుగైన చికిత్స కోసం తన వంతుగా సహకారం అందిస్తానని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం షామీర్‌పేటలోని ఆయన నివాసంలో ఈటలను కలిసి సమస్యను వివరించారు. ఓ ఆస్పత్రి యాజమాన్యంతో ఆయన మాట్లాడారు. ఈటలను కలిసిన వారిలో బీజేపీ నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, పెంటయ్య, రమేష్ యాదవ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ కథలు నమ్మేస్థితిలో జనం లేరు



మహిళలకు దండంపెడుతూ ఓట్లు అడుగుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



శామీర్‌పేటలో కొమ్మూరి భారీ ర్యాలీ

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు నమ్ముతున్నారు
- అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి, భువనగిరి పార్లమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్

జనగామ/జనగామ రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చెప్పే కథలు.. బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అన్ని వర్గాల ప్రజానీకం బలంగా నమ్ముతున్నారని ఆ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్ పేర్కొన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్, శామీర్‌పేట, పసరమడ్ల, ఓబుల్ కేశ్వాపూర్‌తో పాటు జనగామ పట్టణంలోని పలు వార్డుల్లో వారు బుధవారం గడప గడపకూ ప్రచారం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో రెండు దఫాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పదేళ్లలో చేయని అభివృద్ధి.. మూడోసారి గెలిపిస్తే చేస్తామనడం ఆ పార్టీ అవివేకానికి నిదర్శనమన్నారు. దళితులకు మూడెకరాల భూమి, ఉచిత ఎరువులు, కేజీ టు పీజీ విద్య, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతులకు వందశాతం రుణమాఫీ, పంట నష్టపరిహారం.. ఇలా కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలిపోయాయన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఆ తర్వాత యువతను నట్టేట ముంచాడని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసి పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తూట్లు పొడిచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీ, నాయకుల్లో దడ పుడుతోందని, ఓటమి భయంతో ప్రజలను మభ్యపెడుతూ తప్పుడు ప్రచారాలకు తెరలేపుతున్నారని పేర్కొన్నారు.

అధికారం కాంగ్రెస్‌దే..

రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టబోతున్నారు.. అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కొమ్మూరి పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసుగు చెందిన జనం ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని, మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పారు. ఇందులో ఎటువంటి అపోహలకు తావు లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఆశీర్వదిస్తే జనగామ నియోజకవర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని వివరించారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామని ఇందుకు అన్ని వర్గాల సహకారం తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రం, మున్సిపాలిటీని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, బీఆర్ఎస్ మాయ మాటలు వినకుండా చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారం సందర్భంగా అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు కొమ్మూరికి బోనాలు, కోలాటం, మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు సర్వ్వల నరసింగరావు, చిర్ర సత్యనారాయణరెడ్డి, ధర్మ గోవర్ధన్‌రెడ్డి, కొత్త కరుణాకర్‌రెడ్డి, శివరాజ్ యాదవ్, గనిపాక మహేందర్, రాజు, సిద్ధయ్య గౌడ్, బాలరాజు గౌడ్, నర్సిరెడ్డి, కృష్ణస్వామి, కట్ట కృష్ణ, శేఖర్, ఆలేటి సిద్ది రాములు, కాముని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో కొమ్మూరికి స్వాగతం పలుకుతున్న మహిళలు

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ యశ్వంతపురంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యాన గడప గడపకు ప్రచారం చేపట్టారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, కౌన్సిలర్ వంగాల కళ్యాణి, మండల అధ్యక్షురాలు కాముల జయ, మునిబేగం, సుజాత పాల్గొన్నారు.